

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాబాలు

కరీంనగర్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అత్యధిక లాభాలు గడించవచ్చని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖ డే అన్నారు. ఆయిల్‌పామ్ సాగుపై కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రాథమిక సహ కార సంఘాల అధ్యక్షులు, పాలకవర్గాల సభ్యులు, కార్యదర్శులకు అవగాహన కార్య క్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆయిల్‌పామ్ తోటల పెంపకంతో అత్యధిక లాభాలు గడించవచ్చన్నారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు, వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, జిల్లా ఉద్యాన అధికారి కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



'పంచాయతీ' పోరుకు నగారా

- ఎన్నికల షెడ్యూల్ విడుదల
- మూడు విడతల్లో పోలింగ్
- అమల్లోకి ఎన్నికల కోడ్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

గ్రామ పంచాయతీ ఎన్నికలకు నగారా మోగింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీంతో ఎన్నికల ప్రక్రియ ముగిసే ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. డిసెంబరు 11, 14, 17 తేదీల్లో మూడు విడతల్లో గ్రామపంచాయతీ ఎన్నికలను నిర్వహిస్తారు. ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం ఓటరు జాబితా, రిజర్వేషన్ల ఖరారుతో పాటు ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

● జిల్లాలో 316 పంచాయతీలు

జిల్లాలో 316 గ్రామ పంచాయతీల సర్పంచు, 2,946 వార్డు సభ్యులకు ఎన్ని కలు జరుగనున్నాయి. వీటిలో 50 శాతం మహిళలకు కేటాయించారు. జిల్లాలో 5,07,531 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగిం చుకోనున్నారు.

● మొదటి విడతలో జిల్లాలోని గంగాధర మండలంలోని 33 పంచాయతీలకు, 296 వార్డులకు, రామడుగు మండలం లోని 23 గ్రామపంచాయతీలు, 222 వార్డులు, చొప్పదండి మండలంలోని 16 పంచాయతీలు, 154 వార్డులు, కొత్తపల్లి మండలంలోని 6 పంచాయతీలు, 62 వార్డులు, కరీంనగర్ రూరల్ మండలంలోని 14 పంచాయ తీలు, 132 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తారు. మొదటి విడతలో మొత్తం 92 పంచాయ తీలకు, 866 వార్డులకు పోలింగ్ జరుగు తుంది. మొదటి విడతలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేం దుకు 866 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పంచాయతీల్లో డిసెంబరు 11న పోలింగ్ జరగనుంది.

● రెండో విడతలో చిగురుమా మిడి మండలంలోని 17 పంచాయ

(మిగతా 8వ పేజీలో)

ఎన్నికల షెడ్యూల్

విడత	మండలాలు	షెడ్యూల్
మొదటి విడత డిసెంబరు 11	గంగాధర - 33 పంచాయతీలు రామడుగు - 23 పంచాయతీలు చొప్పదండి - 16 పంచాయతీలు కొత్తపల్లి - 6 పంచాయతీలు కరీంనగర్ రూరల్ - 14 పంచాయతీలు మొత్తం 92 పంచాయతీలు, 866 వార్డులు	నోటిఫికేషన్ : నవంబరు 27 నామినేషన్ : నవంబరు 27 నుంచి 29 నామినేషన్ల పరిశీలన : నవంబరు 30 ఉపసంహరణ గడువు : డిసెంబరు 3 పోలింగ్ : డిసెంబరు 11 (సమయం ఉదయం 7 నుంచి మధ్నాహ్నం 1 వరకు)
రెండో విడత డిసెంబరు 14	చిగురుమామిడి - 17 పంచాయతీలు తిమ్మాపూర్ - 23 పంచాయతీలు గన్నేరువరం - 17 పంచాయతీలు మానకొండూర్ - 29 పంచాయతీలు శంకరపట్నం - 27 పంచాయతీలు మొత్తం 113 పంచాయతీలు, 1046 వార్డులు	నోటిఫికేషన్ : నవంబరు 30 నామినేషన్ : నవంబరు 30 నుంచి డిసెంబరు 2 నామినేషన్ల పరిశీలన : డిసెంబరు 3 ఉపసంహరణ గడువు : డిసెంబరు 6 పోలింగ్ : డిసెంబరు 14 (సమయం ఉదయం 7 నుంచి మధ్నాహ్నం 1 వరకు)
మూడో విడత డిసెంబరు 17	వీణవంక - 26 పంచాయతీలు ఇల్లందకుంట - 18 పంచాయతీలు జమ్మికుంట - 20 పంచాయతీలు హుజూరాబాద్ - 20 పంచాయతీలు సైదాపూర్ - 27 పంచాయతీలు మొత్తం 111 పంచాయతీలు, 1034 వార్డులు	నోటిఫికేషన్ : డిసెంబరు 3 నామినేషన్ : డిసెంబరు 3 నుంచి 5 నామినేషన్ల పరిశీలన : డిసెంబరు 6 ఉపసంహరణ గడువు : డిసెంబరు 9 పోలింగ్ : డిసెంబరు 17 (సమయం ఉదయం 7 నుంచి మధ్నాహ్నం 1 వరకు)

రైతులు మెళకువలు పాటించాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి



రైతు నేస్తం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి, ఎంఏవో బి సత్యం

కరీంనగర్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పంటల సాగు విషయంలో మెళకువలు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి రైతులకు సూచించారు. కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్‌లోని రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్ నుంచి వ్యవ సాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎన్‌ఎఫ్ ఎస్ పథకం వరి విత్తనాల పంపిణీపై వివరించారు. అనంతరం దుర్శేడ్‌లో కూరగాయల సాగు, వరి కోసిన పొలాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి, ఎంఏవో సత్యం పరిశీలించారు. ఈ సందర్భంగా కూరగాయల సాగు, వరి కొయ్యకాళ్లు కాల్చడం వల్ల జరిగే నష్టాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవ సాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి, ఎంఏవో బి సత్యం, ఏఈవో స్వర్ణలత, బీటీఎం శ్రీలత, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలి..

- అవగాహనతోనే ప్రమాదాలకు అడ్డుకట్ట..
- రోడ్ సేఫ్టీ కమిటీ మీటింగ్‌లో కలెక్టర్ పమేలా సత్పతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ క్రైం, నవం బరు 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నిబంధ నలు ప్రతి ఒక్కరూ పాటిం చాలని, అవగా హనతోనే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయొచ్చని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారించేందుకు అన్ని శాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాలన్నారు. వాహనదారులు, ప్రజలు ట్రాఫిక్ నియ మనిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని సూచిం చారు. పరిసరాలను గమనిస్తూ డ్రైవింగ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలను నివారించ వచ్చన్నారు.

● రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నియంత్రించేందుకు పోలీస్ శాఖ తరఫున బహుముఖ వ్యూహం అమలు చేస్తున్నామని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. హైదరాబాద్, వరంగల్, జగిత్యాల, సిరి సిల్ల, చొప్పదండి రహదారులపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించామన్నారు. ఆయా రహదారుల్లో బ్లాక్ స్పాట్లను గుర్తించామని, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రమాదాలకు ముఖ్య కారణం అతివేగం, నిర్లక్ష్యంగా మద్యం తాగి డ్రైవింగ్ చేయడమేనని తెలిపారు. కరీంనగర్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ అన్ని పనిచేసేలా అధికారులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. డ్రంకెన్ డ్రైవ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ చేస్తున్న వారిని గుర్తించి జరిమానా విధిస్తున్నామని సీపీ తెలిపారు. రోడ్డు ప్రమాదాలు నివారణకే డీజీపీ శివదర్‌రెడ్డి అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ప్రారంభించారని, ఈ కార్యక్రమాన్ని జిల్లాలో విస్తృతంగా చేపడుతున్నామని సీపీ గౌస్ ఆలం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో శ్రీకాంత్ చక్రవర్తి, ఏసీపీలు విజయకుమార్, వెంకటస్వామి, శ్రీనివాస్ జి, యాదగిరిస్వామి పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

భగత్‌నగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-1 డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ విజయ మాధురి ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 2న మంగళవారం కరీంనగర్ బస్టాండ్ నుంచి మధ్యాహ్నం 2.30కు బస్సు బయలు దేరు తుందన్నారు. 3న కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం అదే రోజు రాత్రి అరుణాచలానికి చేరుతుందన్నారు. గిరి ప్రదక్షిణ, మహాదీప దర్శనం అనంతరం అరుణాచలం నుంచి 4న గురువారం మధ్యాహ్నం బయలుదేరి మరుసటి రోజు జోగులాంబ దర్శనం తర్వాత 5న కరీంనగర్ చేరుకుంటుందన్నారు. ఈ బస్సులో చార్జీలు పెద్దలకు 4700, పిల్లలకు 3540 రూపాయలుగా నిర్ణయించామన్నారు. మరిన్ని వివరాలకు 73828 49352, 9959225920, 8074690491 నంబర్లలో సంప్రదించాలన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- సీపీ గౌస్‌ఆలం



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీస్ కమిష నరేట్ యంత్రాంగం పూర్తి సంసిద్ధంగా ఉండాలని సీపీ గౌస్ ఆలం ఆదేశించారు. మంగళవారం కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులతో సీపీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల సన్నద్ధత, శాంతిభద్రతల పరిరక్షణపై కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా జరిగేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. గత ఎన్నికల సమయంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిని, పాత నేరస్తులను గుర్తించి వారిని వెంటనే బైండోవర్ చేయాలన్నారు. కమిషన రేట్ పరిధిలో లైసెన్స్ కలిగిన తుపాకులను వెంటనే ఆయా పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేయించుకో వాలన్నారు. అక్రమ మద్యం రవాణా, నిల్వలపై దృష్టి సారించాలని ఆదేశించారు.

● అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం..

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని పోలీస్ కమిషనర్ గౌస్‌ఆలం అధికారు లను ఆదేశించారు. కరీంనగర్ రూరల్ డివిజన్ ఏసీపీ కార్యాలయాన్ని సీపీ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని శాంతి భద్రతలు, క్రైం రేట్‌పై అధికారు లతో సమీక్ష నిర్వహించారు. ఈ సంద ర్భంగా కార్యాలయంలో పెం డింగ్‌లో ఉన్న కేసుల వివరాలను, వాటికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ పెం డింగ్ కేసులను త్వరితగతిన పరిష్క రించాలని సూచించారు. విజిబుల్ పోలీ సింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయ కుమార్, సీఐలు నిరంజన్‌రెడ్డి, సదన్ కుమార్, బిల్లా కోటేశ్వర్, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అమలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు

సుభాష్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వెల్ఫేర్ బోర్డు ద్వారానే కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘాల జిల్లా జేఏసీ నాయకులు ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మంగ ళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎస్సీ హెల్త్ టెస్టులను వెంటనే రద్దు చేయాలని, కార్మికులందరికి హెల్త్ కార్డులు ఇవ్వాలని, సహజ మరణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డు ని .దులు ప్రైవేటు బీమా కంపనీలకు ఇచ్చిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేబర్ కార్యాలయంలో అధికారులు బ్రోకర్లు, ఏజంట్లను పెట్టుకొని పని చేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్క రించకపోతే డిసెంబరు 5న హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాల యాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయ కులు ఎడ్ల రమేశ్, పిట్టల సమ్మయ్య, మల్లయ్య, కటికరెడ్డి బుచ్చన్న, జంబుకం వెంకన్న, రాగుల ఎల్లయ్య, చక్రపాణి, రాములు, కొము రయ్య, రేగుల మల్లయ్య, పిట్టల కొమురయ్య పాల్గొన్నారు.

మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



మహిళ సంఘాలకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండల కేంద్రంలో నియోజకవరానికి చెందిన 4,916 స్వశక్తి సంఘాలకు 4.76 కోట్ల రూపాయల వడ్డీలేని రుణాల చెక్కులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు వడ్డీలేని రుణాలను సద్వినియోగం చే సుకుని వ్యాపార వేత్తలుగా ఎదగాలన్నారు. అనంతరం నారాయణపూర్ నిర్వాసితులకు పరిహార చెక్కులను అందజేశారు. నారాయణపూర్ నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం అందజేస్తామన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో నిర్వాసి తులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజిత, ఎంపీడీవో రాము, మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్‌రెడ్డి, కురిక్యాల సింగిల్ విండో అధ్యక్షుడు తిరుమల్‌రావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ తోట కరుణాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మనోహర్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాలు పెంచాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

ఇల్లందకుంట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు పెంచాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ అన్నారు. ఇల్లం దకుంట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని హాజరు రిజిస్టర్, అవ ట్ పేషెంట్‌తో పాటు ఇతర రికార్డులు, మందుల నిల్వ లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక రక్త పోటు, షుగర్ వ్యాధికి సంబంధించి ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మందులను వాడుకోవాలన్నారు. ఆరో గ్య మహిళ హెల్త్ క్యాంపులోని మహిళల రీస్క్రీ నింగ్ వంద శాతం పూర్తి చేయాల న్నారు. రెఫెరల్ కేసులను ఫాలోఆప్ చేస్తూ వారికి అవగాహన కలిగిం చాలన్నారు. సిజేరియన్ వల్ల కలిగే సమస్యలను ప్రజ లకు వివరించాలన్నారు. సాధారణ ప్రసవాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరిగేటట్లు గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, మండల వైద్యాధికారి డాక్టర్ మధుకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నార



ఇల్లందకుంట పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

రైతు ఖాతాకు బదులు రాజన్న ఖజానాకు..

- పత్తి విక్రయించిన మహిళా రైతు..
- సాంకేతిక లోపం అని తేల్చిన అధికారులు
- ఇరవై రోజులకు రైతు ఖాతాలో జమ



సత్తమ్మ

వేములవాడ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీసీఐకి పత్తి విక్రయించిన రైతు ఖాతాలోకి కాకుండా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టు ఖాతాలోకి డబ్బులు జమ అయ్యాయి. దీంతో బ్యాంకు, దేవస్థానం, మార్కెట్ యార్డు, సీసీఐ చుట్టూ తిరగడంతో చివరికి 20రోజులకు ఆమె ఖాతాలోకి డబ్బులు చేరాయి. వేములవాడ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఏదుల సత్తమ్మకు ఆరు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో నాలుగు ఎకరాల్లో కుమారుడు వెంకటేశ్ పత్తివేశాడు. ఈ పత్తిపంటలో పండిన పత్తిని ఈనెల 6న వేములవాడ పట్టణ పరిధిలోని నాంపల్లి లక్ష్మీనర్సింహ ఇండస్ట్రీస్‌లో ఏర్పాటుచేసిన సీసీఐ కొనుగోలు కేంద్రంలో 27క్వింటాళ్ల పత్తిని విక్రయించారు. వరంగల్ సీసీఐ ద్వారా 2,11,549 రూపాయలు సత్తమ్మ ఖాతాలో జమ అయినట్లు సెల్‌ఫోన్‌కు మెస్సెజ్ వచ్చింది. ఈనెల 11న వేములవాడ ఎస్‌బీఐ బ్రాంచికి వెళ్లి డబ్బులు డ్రా చేసేందుకు ప్రయత్నించగా ఖాతాలో డబ్బులు లేవని సిబ్బంది చెప్పారు. కుమారుడితో పాటు ఆమె బ్యాంకు మేనేజర్ సంపత్‌ను అడుగడంతో అసలు విషయం బయటపడింది. డబ్బులు రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టు ఖాతాలోకి మళ్లాయి. ఆమె ఆధార్ లింకు దేవస్థానం ట్రస్టు ఖాతాకు లింకు అయి ఉంది. ఏడాదిగా వంట గ్రాస్ సబ్సిడీ డబ్బులు ఎస్ఆర్ఆర్ ట్రస్టు ఖాతాలోనే జమ అవుతున్నట్లు గుర్తించారు. సీసీఐ కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి అధికారి రఘురాంను కలిసి జరిగిన విషయాన్ని చెప్పడంతో వరంగల్‌లోని రీజినల్ కార్యాలయానికి లేఖ రాశారు. సాంకేతిక లోపంతో రైతు ఖాతాలోకి చేరాల్సిన డబ్బులు రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టు ఖాతాలోకి వెళ్లాయని, ఈ డబ్బులు తిరిగి సీసీఐకి జమ చేయాలని వరంగల్ నుంచి ఈనెల 20న లేఖ వచ్చింది. ఆ తర్వాత రైతు, బ్యాంకు అధికారులు ఆలయ ఈవోను కలిసి సమస్య వివరించారు. ఎట్టకేలకు 2,11,549 రూపాయలు ట్రస్టు ఖాతా నుంచి రైతు ఖాతాకు మళ్లించారు. దీంతో ఆ మహిళా రైతు బ్యాంకు నుంచి మంగళవారం డబ్బులు డ్రా చేసుకొని ఊపిరి పీల్చుకుంది.

అడవి శ్రీరాంపూర్‌లో బెల్లం పానకం ధ్వంసం

ముత్తారం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముత్తారం మండలంలోని అడవిశ్రీరాంపూర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో మంథని ఎక్సైజ్ పోలీసులు మెరుపుదాడులు నిర్వహించారు. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటు సారాయి తయారు చేస్తున్నారనే పక్కా సమాచారంతో మంథని ఎక్సైజ్ ఎస్ఐ సాయికుమార్ తన సిబ్బందితో దాడులు చేపట్టారు. అక్కడ నాటు సారాయికి తయారీగా ఉన్న సుమారు 300 లీటర్ల ఇప్ప పువ్వు, బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. నిషేధిత గుడుంబా తయారు చేసిన, విక్రయించిన చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. గుడుంబాపై ఎలాంటి సమాచారం ఉన్న పోలీసులకు అందించాలని సూచించారు. సిబ్బంది శ్రీనివాస్, రఘు, నిరంజన్, రవి పాల్గొన్నారు.

- వాట్సాప్ ద్వారా అందుబాటులోకి 20కి పైగా సర్వీసులు
- దరఖాస్తులకు మరింత సులభతరం
- సర్టిఫికెట్ సిద్ధం కాగానే డౌన్‌లోడ్ లింక్
- ప్రజలకు, విద్యార్థులకు తీరనున్న కష్టాలు



అరచేతిలో మీసేవ

ముత్తారం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఏదైనా అప్లై చేయాలంటే మీ సేవ చుట్టూ తిరగాల్సి వచ్చేది. ముఖ్యంగా పిల్లల చదువుల కోసం కులం, నివాసం, ఆదాయ సర్టిఫికెట్ కోసం మీ సేవల వద్ద గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి ఉండేది. ఈ సమస్యలకు చెక్ పెడుతూ మీసేవ సర్వీసును ప్రజలకు మరింత చేరువ చేసేందుకు నేరుగా వాట్సాప్ ద్వారానే సేవలు పొందేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ డిజిటల్ సేవలను ఈ నెల 18న మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఇక నుంచి కేవలం వాట్సాప్‌లో మెసేజ్ పెడితే 20కి పైగా మీసేవ సర్వీసులను పొందవచ్చు. వాట్సాప్ 8096958096 నెంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేస్తే చాలు వెంటనే రిప్లైలో మెనూ వస్తుంది. కావాల్సిన సేవలను ఎంచుకొని దరఖాస్తు చేసుకోవచ్చు. ఎప్పటికప్పుడు అప్డేట్‌తోపాటు ఆమోదం పొందిన సర్టిఫికేట్‌ను డౌన్ లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించారు. ఈ మార్పుతో ప్రజలకు మరింత సులభంగా.. వేగంగా.. ప్రభుత్వ సేవలు అందుతాయని అధికారులంటున్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు.. డౌన్‌లోడ్

అధికారిక నంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ చేస్తే నమస్కారం.. తెలంగాణ మీసేవకు స్వాగతం. మీకు ఎలాంటి సేవలు కావాలంటూ రిప్లై వస్తుంది. అందుబాటులో ఉన్న సర్వీసుల మెనూ కనిపిస్తుంది. అందులో దరఖాస్తును ఎంచుకో వాలి. దరఖాస్తును పూరించి అవసరమైన డాక్యుమెంట్లు, ఫొటోలు స్కాన్ చేయాల్సి ఉంటుంది. సూచించిన ఫీజును యూపీఐ ద్వారా సుర క్షితంగా చెల్లించవచ్చు. ఆ తర్వాత దరఖాస్తు స్టేటస్, అప్డేట్స్ అన్ని వాట్సాప్ లోనే మెసేజ్ రూపంలో వస్తాయి. ఆన్‌లైన్‌లో అందిన దర ఖాస్తు పరిశీలించిన అధికారులు ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తారు. సర్టిఫికేట్ సిద్ధం కాగానే దాని డౌన్‌లోడ్ లింక్ ఫోన్‌కు వస్తుంది. దాన్ని క్లిక్ చేసి డౌన్‌లోడ్ చేసుకొని పీడీఎఫ్ రూపంలో సేవ్ చేసుకోవచ్చు. అవసరమైతే ప్రింట్ కూడా తీసుకొని వాడుకోవచ్చు.

అందుబాటులో ఉండే సేవలు ఇవే...

ప్రస్తుతం 20 పైగా సేవలు వాట్సప్ ద్వారా అందుబాటులో ఉన్నాయి. మరిన్ని సేవలను చేర్చే పనిలో అధికారులు ఉన్నారు. ఇక ఫోన్ ద్వారానే ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రం, బర్త్, డెత్ సర్టిఫికెట్స్ దరఖాస్తు చేసుకొని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. నల్లా, కరెంటు బిల్లులు, పోలీస్ చలాన్స్, ఆర్టీఏ లైఫ్ టాక్స్ చెల్లించ వచ్చు. ఇళ్ల నిర్మాణాలకు గ్రామ పంచాయతీ పర్మిషన్లు, పంచాయతీల్లో, మున్సిపాలిటీల్లో మ్యూటేషన్ దరఖాస్తులు, ఆస్తి పన్నులు చెల్లించుకోవచ్చు. దేవాలయాల సమాచారం, దైవ దర్శనాల స్లాట్ బుకింగ్, గదుల బుకింగ్, ఆన్‌లైన్ పూజా బుకింగ్ సౌలభ్యం ఇందులో ఉంది. రేషన్ కార్డుల జారీ, రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్, వ్యవసాయ మార్కెట్ ధరలు ఇలా పలు రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి.

కట్టుకున్నోడే కడతేర్చాడు

- భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించి సజీవదహనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ మాధవి



కేసు వివరాలు వెల్లడిస్తున్న హుజూరాబాద్ ఏసీపీ మాధవి

సైదాపూర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాములపల్లి గ్రామానికి చెందిన చింతకుంట్ల సుకృతను ఆమె భర్త చింతకుంట్ల మహిపాల్‌రెడ్డి పథకం ప్రకారం తమ వ్యసాయ భూమి వద్ద పెట్రోల్ పోసి నిప్పంటించి సజీవ దహనం చేసినట్లు హుజూరాబాద్ ఏసీపీ మాధవి తెలిపారు. మంగళవారం సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. హుజురాబాద్ మండలం తోకలపల్లి గ్రామానికి చెందిన సుకృతను 2000 సంవత్సరంలో రాములపల్లి గ్రామానికి చెందిన చింతకుంట్ల మహిపాల్‌రెడ్డికి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఒక కుమార్తె జన్మించింది. 2002లో మహిపాల్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన మేకల విజయను ప్రేమ పేరుతో తీసుకెళ్లగా విజయ కుటుంబ సభ్యులు వారిని వరంగల్‌లో పట్టుకొని తీసుక రాగా విజయ ఆత్మహత్య చేసుకొని మృతి చెందింది. సుకృత-మహిపాల్‌రెడ్డి మధ్య గొడవలు జరుగుతుండగా సుకృత గ్రామంలోనే ఓ ఇంట్లో కిరాయికి ఉంటోంది. 2009లో మహిపాల్‌రెడ్డి మళ్లీ రమాదేవి అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. దాంతో సుకృత మహిపాల్‌రెడ్డిపై వరకట్నం, రెండో వివాహంపై, మెయింటినెన్స్ కేసు వేసింది. చాలాసార్లు సుకృత మహిపాల్‌రెడ్డి మధ్య పంచాయతీలు జరిగాయి. చివరకు మహిపాల్‌రెడ్డి సుకృతకు 20 గుంటల భూమి ఇచ్చాడు. ఆ భూమిని సుకృత తన కుమార్తెకు రిజిస్ట్రేషన్ చేయడంతో మహిపాల్‌రెడ్డి సుకృతపై కోపం పెంచుకున్నాడు. సుకృతను చంపుతానని గతంలో చాలాసార్లు బెదిరించాడు. ఈ నెల 21న సైదాపూర్-హుజూరాబాద్ రోడ్డులోని జాగీర్‌పల్లి పెట్రోల్ బంకులో పెట్రోలు కొనుగోలు చేసి ముందుగానే రాములపల్లి శివారులోని తన వ్యవసాయ భూమి వద్ద తాటి కమ్మల కింద దాచి పెట్టాడు. ఈ నెల 22న మధ్యాహ్నం తమ వ్యవసాయ భూమి వద్ద సుకృత ఒంటరిగా వ్యవసాయ పనులు చేస్తుండగా మహిపాల్‌రెడ్డి సుకృతపై పెట్రోల్ పోసి నిప్పంటించి సజీవ దహనం చేసి పరారయ్యాడని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు చేసి మంగళవారం నిందితుడు మహిపాల్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ మాధవి తెలిపారు. కార్యక్రమంలో హుజూరాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రశేఖరుడు

చంద్రుడిని శిరస్సుపై ధరించాడు కాబట్టి శివుడిని చంద్ర శేఖరుడు అని పిలుస్తారు. రాజన్న క్షేత్రమైన వేములవాడలో ఓ దృశ్యం అందరినీ ఆకట్టుకుంది. మున్సిపల్ పార్కులోని ఏర్పాటు చేసిన పరమశివుడి విగ్రహం శిరస్సుపై చంద్రుడు ఇలా కనిపించాడు. దీంతో అక్కడ ఉన్న వారు విగ్రహంపై ఇలా ఇద్దరు చంద్రులు కనిపిస్తున్నారని ఆశ్చర్యపోయారు. ఈ దృశ్యాన్ని పలువులు ఆసక్తిగా తిలకించారు.
- వేములవాడ, ఆంధ్రజ్యోతి

రామగుండానికి డబుల్ బొనాంజా

- క్యాబినెట్‌లో రెండు విద్యుత్ కేంద్రాలకు ఆమోదం
- 800మెగావాట్ల సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్ర స్థాపన
- మేడిపల్లి ఓసీపీల్లో పంప్‌డ్ స్టోరేజీ ప్లాంట్

గోదావరిఖని, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రామగుండానికి రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బోనంజా ప్రకటించింది. మంగళవారం జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో రూ.17వేల కోట్ల పెట్టుబడులతో రెండు విద్యుత్ కేంద్రాల స్థాపనకు ఆమోద ముద్ర వేసింది. జీవిత కాలం ముగియడంతో మూతబడిన బీ థర్మల్ స్థానంలో ఎన్‌టీపీసీ సహకారంతో 800మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రూ.13వేల కోట్ల పెట్టుబడితో ఈ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించనున్నారు. జెన్‌కో దగ్గర వనరులు అందుబాటులో లేకపోవడంతో ఎన్‌టీపీసీ సహకారంతో విద్యుత్ కేంద్రం నిర్మించాలని క్యాబినెట్ నిర్ణయించింది. ఎన్‌టీపీసీ యాజమాన్యం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపింది. రాష్ట్రంలో జాయింట్ వెంచర్‌లో కానీ, స్వతహాగా కానీ విద్యుత్ కేంద్రాల స్థాపనకు ఆసక్తి కనబరిచింది. ఈ పరిస్థితుల్లో రామగుండం బీ థర్మల్ స్థానంలో ఏర్పాటు చేయనున్న కొత్త విద్యుత్ కేం ద్రాన్ని ఎన్‌టీపీసీ సహకారంతో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో సింగరేణితో జాయింట్ వెంచర్ చేయాలని భావించినా ఇప్పుడు ఎన్‌టీపీసీ ముందుకు రావడంతో ఎన్‌టీపీసీని భాగస్వామ్యం చేయాలని నిర్ణయించారు. తద్వారా స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కలగనున్నది. అలాగే రామగుండం పట్టణం పక్కనే ఉన్న మేడిపల్లి ఓసీపీలో సుమారు రూ.4వేల కోట్ల సింగరేణిలోనే మొదటిసారిగా పంప్‌డ్ స్టోరేజీ పవర్‌ప్లాంట్ నిర్మాణానికి కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పవర్‌ప్లాంట్ నిర్మాణం జరిగితే సింగరేణి సంస్థ భవిష్యత్‌లో మరిన్ని పంప్‌డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లు నిర్మించేందుకు మార్గం ఏర్పడుతుంది. ఈ రెండు భారీ ప్రాజెక్టులు రామగుండానికి రావడంతో స్థానికంగా హర్షం వ్యక్తం అవుతుంది. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ రామగుండం పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఆ హామీని నెరవేర్చుకునేందుకు ముఖ్యమంత్రి, మంత్రులపై ఒత్తిడి చేస్తూ వచ్చారు. మంత్రి శ్రీధర్‌బాబు పరిశ్రమల శాఖ మంత్రిగా ఉండడంతోపాటు ప్రభుత్వంలో కీలకం కావడంతో ఈ ప్లాంట్ ప్రకటనకు పూర్తిగా సహకరించారు.

రామగుండానికి సీఎం ప్రాణం పోశారు...



- ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

రామగుండంలో నిజాం హయాంలో విద్యుత్ కేంద్రాల స్థాపన జరిగింది. అవి జీవితకాలం ముగియడంతో మూతబడ్డాయి. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి రామగుండానికి విద్యుత్ కేంద్రాలు మంజూరు చేసి ప్రాణం పోశారు. ప్రజల మనోభావాలు, సెంటిమెంట్లు, ఉపాధిని పరిగణలోకి తీసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహకరించారు. జిల్లా మంత్రి శ్రీధర్‌బాబు రుణం తీర్చుకోలేనిది.



ప్రకటన చేస్తున్న మంత్రులు, చిత్రంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

భూ సేకరణ అవసరం ఉండదు...

రామగుండంలో విద్యుత్ కేంద్రం నిర్మాణంలో ఎన్‌టీపీసీ భాగస్వామ్యం అయితే భూసేకరణ అవసరాలు కూడా ఉండదు. పక్కనే ఉన్న కుందనపల్లి యాష్‌పాండ్‌ను కానీ, రాజాపూర్‌లో నిర్మించనున్న యాష్ పాండ్‌ను కానీ వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

గుప్త నిధులు ఉన్నాయని మోసం చేసిన వ్యక్తులపై కేసు

కోనరావుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇంటిలో గుప్త నిధులు ఉన్నాయని మోసం చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన దుగ్గు వేణు ఇంటిలో గుప్త నిధులు ఉన్నాయని వాటిని తీయడానికి ఖర్చు అవుతాయని నాలుగు లక్షల ఎనిమిది వేల రూపాయలను పెద్దూరు గ్రామానికి చెందిన మేకల నరేష్, కడవంచ ప్రసాద్, నదుల దేవేందర్, నదుల రాజేశం కాజేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య



రాములు(ఫైల్)

కోల్‌సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ద్వారకానగర్‌కు చెందిన బండారి రాములు(56) అనే సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాములు కొంతకాలంగా మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. రాములు భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పశుగ్రాసం దగ్ధం

పెద్దపల్లి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన రైతు గట్టయ్య ఇంటి ముందు ఉన్న పశుగ్రాసం ప్రమాదవశాత్తు దగ్ధమైనట్లు స్థానిక రైతులు తెలిపారు. పంట పొలం కోసి మిగిలిన గడ్డిని పశువుల కోసం ఇంటి ఎదుట కుప్పగా ఏర్పాటు చేసుకోగా ప్రమాదవశాత్తు మంటలు చేలరేగాయి. స్థానికుల సహాయంతో ఆర్పివేశారు. దీంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోగా ప్రభుత్వపరంగా సహాయం అందించాలని రైతు గట్టయ్య కోరారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

- స్థానిక ఎన్నికల్లో పోటీచేస్తే బీ-ఫాం, ప్రచార సామగ్రి ఇస్తాం
- రాష్ట్రీయ లోక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్

కరీంనగర్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమసమాజ నిర్మాణం కోసం యువత రాజకీయాల్లోకి రావాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే వారికి పార్టీ బీ-ఫామ్‌తోపాటు కరపత్రాలు, ఫ్లెక్సీలు, ఇతర ప్రచార సామగ్రి ఉచితంగా అందించి ప్రోత్సహిస్తామని రాష్ట్రీయ లోక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న యువకులకు లోక్‌దళ్ పార్టీ ప్రోత్సాహం ఇస్తుందన్నారు. మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికలు అంటే జోక్‌గా మారిందని, మద్యం, డబ్బుల పంపిణీ లేకుండా ఎక్కడ ఏ ఎన్నికలు జరుగడం లేదని, మద్యం పంపిణీ జరుగుతుందని మునుగోడు ఉప ఎన్నిక సమయంలో వీడియో తీసి ఎన్నికల కమిషన్‌కు పంపిస్తే చర్యలు తీసుకోవలసింది పోయి రెండు బాటిళ్ల వరకు మద్యం పంపిణీ చేయవచ్చని సమాధానమిచ్చారని, ఇప్పుడు ఎన్నికల తీరు ఇలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలక్షన్ ప్రక్రియలో, రాజకీయాల్లో సంస్కరణలు రావలసిన అవసరముందని, అందుకోసం లోక్‌దళ్ పార్టీ ప్రజలను చైతన్యపరిచేందుకు కృషిచేస్తుందని అన్నారు. 30 సంవత్సరాలు ప్రభుత్వోద్యోగం చేసి తెలంగాణ సాధన ఉద్యమం కోసం పదవికి రాజీనామా చేసి 2001లో టీఆర్ఎస్ పార్టీలో ఫౌండర్ మెంబర్ కొనసాగిన తనను రెండు సార్లు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిపించారని గుర్తు చేశారు. సబ్బండ వర్గాలు ఉద్యమించి తెచ్చుకున్న స్వరాష్ట్రంలో పదేళ్ల కేసీఆర్ ధృతరాష్ట్ర పాలన, అవినీతిపాలన, కుటుంబపాలన చేశారని, విద్య, వైద్యం చిన్నాభిన్నం అయ్యాయని దిలీప్‌కుమార్ మండిపడ్డారు. దీనితో టీఆర్ఎస్‌లో కొనసాగకుండా బీజేపీకి రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్‌కుమార్ చేపట్టిన కార్యక్రమాలతో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందనే ఆలోచనతో అందులోకి వెళ్లగా ఆయన రాష్ట్ర అధ్యక్ష పదవి పోయాక ఆ పార్టీలో ఏమీ మార్పు కనిపించలేదని అన్నారు. కేసీఆర్ పాలనలో కంటే రేవంత్‌రెడ్డి పాలనలో ఊరికి ఆరుగురు చొప్పున దోపిడీ, అవినీతికి పాల్పడుతున్నారని ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, 28 లక్షల వృత్తి నైపుణ్య శిక్షణలు పూర్తి చేడయంలో రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని ఆరోపించారు. విలేకరుల సమావేశంలో రాష్ట్రీయ లోక్‌దళ్ జిల్లా బియ్యాల కృష్ణ, ప్రధాన కార్యదర్శులు మడకం ప్రసాద్, దొర, రిషబ్, నర్సింహారావు, వివిధ జిల్లాల అధ్యక్షులు గౌర బీరప్ప, సిద్ధం కుమార్, సతీష్, రాంప్రసాద్, సుధాకర్, బుల్లెట్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్రీయ లోక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్‌కుమార్

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొట్లపల్లి గ్రామానికి చెందిన గోదారి చంద్రయ్య అనే రైతుకు చెందిన ఎద్దు మంగళవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు రెండు ఎద్దులు మేత కోసం గ్రామ శివారు వద్దకు తీసుకువెళ్లి మేపుతుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరు తగిలి షాక్‌తో ఎద్దు మృతి చెందిందని తెలిపాడు. ఎద్దు విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని బాధిత రైతు చంద్రయ్య పేర్కొన్నాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని కొల్లాపూర్ గ్రామానికి చెందిన ఎండీ అబ్దుల్(40) ద్విచక్రవాహ నంపై కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు వస్తున్నాడు. మానకొండూరు మండలంలోని చెంజర్ల బ్రిడ్జి వద్ద కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో అబ్దుల్‌కు తీవ్రగాయాలు కాగా 108 వాహనంలో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

దొంగతనం కేసులో ఒకరికి ఆరునెలల జైలు శిక్ష

సిరిసిల్ల రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో ఒక వ్యక్తికి ఆరునెలల జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పును వెల్లడించినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన శీలం బాబు అనే వ్యక్తి తన భార్య శీలం పద్మను సిరిసిల్ల జిల్లా ఆసుపత్రిలో ప్రసూతి కోసం చేర్పించాడు. ఈ క్రమంలో తన వాహనం కనిపించకపోవడంతో పోలీసులకు బాబు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్ఐ వినీతరెడ్డి వాహనం కోసం గాలిస్తుండగా వాహనాన్ని దొంగిలించిన దుర్మిట్ల నరేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడంతో సీఎంఎస్ ఎస్ ఎస్ఐ శ్రావణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేష్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి ప్రవీణ్ నరేష్‌కు ఆరు నెలల జైలు శిక్షను విధించారు.

రాష్ట్రస్థాయి పద్య రచనలో విద్యార్థినుల ప్రతిభ



ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు సారిక, దివ్యజ్యోతి, హర్షిణి, సంజన, నందినిలు రాష్ట్ర స్థాయి పద్య రచన పోటీల్లో ప్రతిభ కనబర్చారని పాఠశాల హెచ్ఎం మనోహరచారి మంగళవారం తెలిపారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ సారస్వత పరిషతు ఆధ్వర్యంలో నిర్వహించిన పద్య రచన పోటీల్లో విద్యార్థినులు సత్తా చాటారని పేర్కొన్నారు.

జ్ఞాపికలతో పాటు ప్రశంసా పత్రాలను అందుకున్నారని చెప్పారు. రాష్ట్ర స్థాయి పద్య రచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినిలను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజన్‌రెడ్డి, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి



నీరజ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామానికి చెందిన వివాహిత అందె నీరజ (25) అనే వివాహిత మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని రాచర్లగొల్లపల్లిలోని అందె దేవరాజుకు 2014లో కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం అన్నారం గ్రామానికి చెందిన పంగ రాజవ్వ-నాంపల్లి దంపతుల కూతురు నీరజతో వివాహమైంది. ఆ దంపతులకు కుమారుడు జోసిత్ ఉన్నాడు. ఉపాధి నిమిత్తం దేవరాజు యేడాది కిందట దుబాయి దేశానికి వలస వెళ్లాడు. అక్కడ ఆయన తన మామ, బావమరిదితో కలిసి ఉంటున్నాడు. నీరజ తన కొడుకు జోసిత్‌తో కలిసి జీవిస్తోంది. కొడుకు పాఠశాలకు వెళ్లిన అనంతరం వివాహిత నీరజ ఇంటికి గడియ వేసుకుంది. అనుమానం వచ్చిన చుట్టు పక్కల వారు పిలిచినా స్పందించకపోవడంతో వారు అన్నారంలోని నీరజ తల్లి రాజవ్వకు సమాచారం అందించారు. ఆమె వచ్చి చూసేసరికి కూతురు ఉరి వేసుకుని విగతజీవిగా కనిపించింది. మృతురాలు తల్లి రాజవ్వ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మరణంగా కేసు నమోదు చేశామని పోలీసులు వివరించారు. మృతిపై అన్ని కోణాల్లో ఆరా తీస్తున్నామని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న రైతులు

కోనరావుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో ఇసుక ట్రాక్టర్లను రైతులు మంగళవారం అడ్డుకున్నారు. ప్రభుత్వ అనుమతితో నడిపిస్తున్న ఇసుక ట్రాక్టర్లను గ్రామస్థులు, రైతులు అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. కనగర్తి మూలవాగు నుంచి ఇసుక తరలించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి సాగునీరుకు ఇబ్బందికరంగా మారుతుందని రైతులు తెలిపారు. గ్రామ పరిధిలోనే అనుమతి ఇవ్వాలని, వేరే గ్రామాలకు అనుమతి ఇవ్వడం వల్ల వందలాది ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతాయని అన్నారు. తమ గ్రామం నుంచే కాకుండా మూలవాగు పరిసర ప్రాంతాల నుంచి ఇవ్వాలని కోరారు.



కనగర్తిలో నిలిచిన ఇసుక ట్రాక్టర్లు

జాతీయ కళా ఉత్సవాల్లో తృతీయ బహుమతి


జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

చొప్పదండి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ కళా ఉత్సవాల్లో నవోదయ విద్యార్థులు ఇద్దరు ప్రతిభ కనబరిచి తృతీయ బహుమతులు సాధించారు. ఢిల్లీలో జరిగిన జాతీయ కళోత్సవాల్లో 9వ తరతి విద్యార్థి ఎం కార్తికేయ, 10వ తరగతి విద్యార్థి జి వంశీ ఇండిజీనియస్ టాయ్స్ మేకింగ్ పోటీల్లో పాల్గొని తృతీయ బహుమతులు సాధించారు. కాగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, ఆర్ట్ టీచర్ నాగేశ్వర్‌రావును ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి అభినందించారు.

పలు నిర్మాణాల కూల్చివేత


రోడ్డు విస్తరణలో నిర్మాణాలను కూల్చివేస్తున్న సిబ్బంది

వేములవాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ అమర వీరుల స్థూపం నుంచి రాజన్న ఆలయం వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పలు నిర్మాణాల కూల్చివేతలను మంగళవారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ ఇచ్చిన వరకు నిర్మాణాలను కూల్చి వేశారు. కాగా పలువురు ఇంటి యజమానులు మార్కింగ్ దాటి ముందుకు వచ్చి నిర్మాణాలను తొలగిస్తున్నారని కూల్చివేతలను అడ్డుకునేందుకు యత్నించారు. రోడ్డు విస్తరణకు సంబంధిత అధికారులు ఇచ్చిన మార్కింగ్ వరకు తొలగిస్తున్నట్లు తెలిపారు.

టెట్‌కు వేళాయె..

- ఈనెల 29వ తేదీ వరకు దరఖాస్తుకు గడువు
- వచ్చే ఏడాది జనవరిలో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష
- కోచింగ్ సెంటర్లకు డిమాండ్



జగిత్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు నోటిఫికేషన్ రావడంతో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా స్థిరపడాలనుకునే బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన ఆశావహుల్లో ఉత్సాహం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయనుందనే వార్తల నేపథ్యంలో చాలా మంది టెట్‌లో అత్యధిక మా ర్కులు సాధించాలనే తపనతో ప్రిపేర్ అవుతు న్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా టెట్ అర్హత సాధించాలని నిబంధన విధించడంతో వారు కూడా దరఖాస్తు చేస్తున్నారు. ఈనెల 15వ తేదీ నుంచి 29వ తేదీ వరకు టెట్ దరఖాస్తులను స్వీకరించ నున్నారు. వచ్చే యేడాది జనవరి 3వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిం చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పలు వురు అభ్యర్థులు ఇప్పటికే టెట్ రాసేందుకు కోచింగ్ సెంటర్లను ఆశ్రయించగా మరికొందరు గ్రంథాల యాల్లో, ఇంటి వద్ద సొంతంగా ప్రిపేర్ అవుతున్నారు.

● సెలవుల్లో పలువురు ఆశావహులు..

వచ్చే యేడాది జనవరిలో పరీక్ష నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత టెట్ పరీక్షకు జగిత్యాల జిల్లా నుంచి సుమారు 5 వేల మంది అభ్యర్థులు హాజరయ్యారు. ప్రస్తుతం అభ్యర్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. గతంలో టెట్ క్వాలిఫై అయిన వారు మా ర్కులు మెరుగు పర్చుకునేందుకు మళ్లీ టెట్ రాసే అవకాశం ఉంది. ఉపాధ్యాయ కొలువుకు టెట్ క్వాలిఫై తప్పనిసరి కావడంతో పరీక్షకు సన్నద్ధం కావడానికి పలువురు టీచర్లు సెలవు బాట పడుతున్నారు.

● ప్రభుత్వ టీచర్లకూ తప్పనిసరి

సెప్టెంబరు 1వ తేదీన వెలువడిన సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఐదు సంవత్సరాల పైబడి సర్వీస్ ఉన్న టీచర్లు పదోన్నతి అవసరమునుకుంటే రాబోయే రెండేళ్లలో టెట్ తప్పనిసరిగా పాస్ కావాలని, లేదంటే ఉద్యోగాలు కోల్పోతారని సుప్రీం కోర్టు తీరు వెలువరించింది. దీనిపై విద్యాహక్కు చట్టం అమలులోకి రాకముందు ఉన్న టీచర్లకు టెట్ మినహాయింపు కావాలని కోరుతూ, దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన టెట్‌లో ఎలాంటి మినహాయింపులు ఇవ్వలేదు. కోర్టు ఆదేశాల మేరకు టెట్ తప్పనిసరిగా ఇన్ సర్వీస్ టీచర్లు రాయాలని చెబుతూ కొన్ని ప్రత్యేక మినహాయింపు ఇచ్చారు. దీంతో ఉపాధ్యాయులకు టెట్ భయం పట్టుకుంది. ఇన్ సర్వీస్‌లో ఉన్న ఎస్‌జీటీలు పేపర్-1, స్కూల్ అసిస్టెంటట్లు పేపర్-2 రాయాల్సి ఉంటుంది.

పార్లమెంట్‌లో చట్టం చేయాలి



-తిరుక్కోవెల శ్యామ్ సుందర్, టీఎస్ యూటీఎఫ్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష మినహాయింపు ఇవ్వాలి. ఇప్పటికే సమస్యను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లాం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సైతం ఈ మెయిల్, పోస్ట్ ద్వారా, నెలాఖరు వరకు ఎంపీలకు లేఖలు అందించనున్నాం. సర్వీసులో ఉన్న టీచర్ల రక్షణ కోసం పార్లమెంట్‌లో చట్టం చేయాలి.

ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయించాలి



-బోయినిపల్లి ఆనందరావు, పీఆర్‌టీయూ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు

ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలి. కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌కు ఇప్పటికే వినతిపత్రం ఇచ్చాం. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో టెట్ నుంచి మినహాయింపు ఇస్తూ నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నాం. 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులందరికీ టెట్ మినహాయింపు అవసరం.

కరాటే పోటీలకు చీఫ్ అఫీషియల్‌గా వసంత్ కుమార్



కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కె వసంత్ కుమార్ జాతీయ కరాటే పోటీలకు చీఫ్ అఫీషియల్‌గా నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి కరాటే పెటీల్లో ఆయన చీఫ్ రెఫరీగా విధులను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వసంత్‌కు మార్‌ను పలువురు కరాటే మాస్టర్లు అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఏఎస్‌ఐ వెంకట్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి మానేరు వాగు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి యజమాని చేపూరి మహేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

శ్రీరాంసాగర్‌లో నిలకడగా నీరు

జగిత్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం స్వల్పంగా నీరు వస్తోంది. దీంతో డ్యామ్‌లో నీరు నిలకడగా ఉంది. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 1,338 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 80.501 టీఎంసీలు కాగా అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది.

కాంగ్రెస్ నాయకులే ఇసుక మాఫియా అవతారం ఎత్తారు

- ఇసుక కోసం గుంపుల చెక్ డ్యామ్‌ను పేల్చేశారు - మాజీ మంత్రి హరీష్ రావు

జమ్మికుంట రూరల్/ఓదెల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి పాలనలో కాంగ్రెస్ నాయకులు పలు జిల్లాల్లో ఇసుక మాఫియా అవతారం ఎత్తారని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు విమర్శించారు. ఓదెల మండలం గుంపుల, జమ్మికుంట మండలం శంభునిపల్లి, తనుగుల మధ్యనున్న మానేరు వాగులో కూలిపోయిన చెక్ డ్యామ్‌ను ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం మాజీ మంత్రి హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ గుంపుల, శంభునిపల్లి చెక్‌డ్యామ్‌ను ఇసుక మాఫియానే కూల్చిందన్నారు. దీనిని కొందరు కాంగ్రెస్ పెద్దలు ప్రోత్సహిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఇసుక రవాణాకు అడ్డంకిగా ఉన్నాయనే ఉద్దేశంతో పలు జిల్లాల్లో చెక్ డ్యాములను జిలెటిన్ స్టిక్‌లతో పేల్చివేశారని, దీంతో మత్స్యకారులు, రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. గతంలో పెద్దపల్లి మండలం భోజన్నపేట హుస్సేన్‌మియా వాగులోని చెక్ డ్యాంను ఇసుక మాఫియా పేల్చివేయగా రైతులే జిలెటిన్ స్టిక్‌లతోపాటు, ట్రాక్టర్లను, నిందితులను పట్టుకున్నారన్నారు. వారిని పోలీసులకు అప్పజెప్పినా కేసు నమోదు కాలేదన్నారు. అప్పుడు వందల మంది రైతులు ఇసుక మాఫియాపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, అప్పుడే చర్యలు తీసుకున్నట్లయితే నేడు గుంపుల మానేరు వాగులోని చెక్ డ్యామ్ దెబ్బతినేది కాదన్నారు. చెక్ డ్యామ్‌ను పేల్చివేశారని మత్స్యకారులే చెబుతున్నారని, శనివారం పొద్దంతా మానేరు నిండా నీరు ఉందని, తెల్లవారే సరికి కూలిపోయి ఉందని కార్మికులు తెలిపారన్నారు. వర్షాకాలంలో చెక్ డ్యాంపై నీటి ప్రవాహం రోజుల తరబడి వెళ్లినప్పుడే ఏమి కాలేదని, నీటి ప్రవాహం, వర్షాలు తగ్గిన తర్వాత చెక్ డ్యామ్ ఎలా కూలిపోయిందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా రాజ్యం కొనసాగుతుందని, ప్రస్తుతం వాగులోని చెక్ డ్యామ్‌ను పేల్చివేసిన నిందితులపై కేసు నమోదు చేసి, నిర్మాణ వ్యయం 24 కోట్లను రికవరీ చేసి ఉన్నత స్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు.


కూలిన చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు

కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి, రసమయి బాలకిషన్, జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, నాయకులు పొనగంటి సంపత్, పింగిలి రమేష్, మడికొండ సురేందర్ రావు, మునిపట్ల తిరుపతిరెడ్డి, పోడేటి రామస్వామి, రఘువీర్‌సింగ్, గంట రాములు, వంగల తిరుపతి రెడ్డి, నూనేటి సంపత్, ఐరెడ్డి వెంకటరెడ్డి, కనికి రెడ్డి సతీష్, ఆరెల్లి మొండయ్య, కాంతాల సదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ


ఆలయ ఆవరణలో భక్తుల కోలాహలం

మల్యాల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. సోమవారం రాత్రి వరకు చేరుకున్న వారితో పాటు వేలాదిగా వచ్చిన భక్తులు వేకువ జాము నుంచే బారులుతీరి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క సారలమ్మ జాతర రానున్న నేపథ్యంలో ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ తదితర జిల్లాల నుంచి అధికసంఖ్యలో వచ్చిన భక్తులతో కొండంతా రద్దీ నెలకొంది. భక్తులకు ఇబ్బందులు కలగ కుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. అంజన్నను దర్శించుకున్న భక్తులు బేతాళుడు, శ్రీరాముని ఆలయంలోనూ పూజలు జరిపారు. కాగా వైజంక్షన్, ఘాట్‌రోడ్డుపై వాహనాల రాకపోకలకు అస్తవ్యస్త పార్కింగ్‌తో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి వరకు భక్తులు భక్తులు అంజన్నను దర్శించుకున్నారు.

మూడు నెలలు.. ముహూర్తాలు కరువు

- రేపటి నుంచి శుక్ర మౌఢ్యం
- డిసెంబరు 21 నుంచి పుష్యమాసం



కరీంనగర్ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సరంలో ఈ నెల 27వ తేదీ నుంచి మూడు నెలల పాటు వివాహాది శుభ ముహూర్తాలు లేవు. నవంబ రు 27 గురువారం నుంచి ఫిబ్రవరి 17, 2026 వరకు శుక్రమౌఢ్యం కొనసాగనుంది. శూన్యమాసంగా పిలిచే పుష్యమాసం డిసెంబరు 20 నుంచి ప్రారంభమై జనవరి 18తో ముగుస్తుంది. జనవరి 19, సోమవారం నుంచి ఫిబ్రవరి 17 వరకు మాఘమాసం ఉంటుంది. మాఘ మాసం శుభ మాసమే అయినా ఈ మాసంలో మూఢం ఉండటంతో ముహూర్తాలు లేవు. మూఢం, పుష్య మాసంతో కలిపి చూస్తే సుమారు మూడు నెలల వరకు ముహూర్తాలు లేవు. తిరిగి ఫిబ్రవరి 19వ తేదీ గురువారం నుంచి శుభముహూర్తాలు ప్రారంభం కానున్నాయి.

● పండగల వివరాలివే...

డిసెంబరు 1న గీతాజయంతి, 2న హనుమద్వ్రతం, 4న దత్తాత్రేయ జయంతి, 8న సంకటహర చతుర్థి. 16 నుంచి ధనుర్మాసారంభం, 18న మాస శివరాత్రి. 30న ముక్కోటి ఏకాదశి ఉంటుంది. జనవరి 6న సంకటహర చతుర్థి, 14న భోగి-గోదా కల్యాణాలు, 15న సంక్రాంతి, 16న కనుమ. 17న ముక్కనుమ, మాస శివరాత్రి. 23న వసంత పంచమి. 25న రథ సప్తమి. 29న భీష్మ ఏకాదశి, 31న శని త్రయోదశి ఉంటాయి. ఫిబ్రవరి 5న సంకటహర చతుర్థి, 13న షట్ తిల ఏకాదశి, 15న మహా శివరాత్రి నిర్వహిస్తారు.

నా భార్యను బలవంతంగా తీసుకెళ్లారు

- పోలీసులకు యువకుడి ఫిర్యాదు

మల్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తాను ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను ఆమె కుటుంబసభ్యులు బలవంతంగా తీసుకెళ్లారని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మల్యాల మండల కేంద్రానికి చెందిన ముత్తుకుమార్ అనే యువకుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లాకు చెందిన మాధవి అనే యువతిని ఈ నెల 16వ తేదీన ప్రేమ వివాహం చేసుకున్నాడు. దీంతో ఆగ్రహంతో ఉన్న యువతి కుటుంబసభ్యులు ముత్తుకుమార్ ఇంటికి వచ్చి అతడి తల్లిదండ్రులపై కర్రలతో దాడి చేయడమే కాకుండా మాధవిని కారులో బలవంతంగా తీసుకెళ్లినట్లు మాధవి భర్త ముత్తుకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పలువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ పేర్కొన్నారు.

గంజాయి అమ్ముతూ, తాగిన వ్యక్తులకు జైలు శిక్ష

సిరిసిల్ల రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో గంజాయి అమ్ముతూ తాగుతున్న ముగ్గురు వ్యక్తులకు 11 నెలల జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చినట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన వీరభత్తిని అజయ్‌తో పాటు అదే మండలానికి చెందిన గట్టపల్లి క్రాంతిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. కోర్టులో సీఎం ఎస్ఎస్ఐ శ్రావణ్ చార్జిషీట్ దాఖాలు చేయగా కోర్టు కానిస్టేబుల్ వేముల నరేష్ ఆరుగురు సాక్షులను ప్రవేశపెట్టారు. దీంతో జడ్జి గట్టపల్లి క్రాంతికి 11 నెలు జైలు శిక్ష, వీరబత్తిని అజయ్‌కి నెలరోజుల శిక్షతోపాటు 2,500 రూపాయల జరిమానా విధించారని తెలిపారు. మరో గంజాయి కేసులతో జక్కనపల్లి వివేక్‌కు నెలరోజుల జైలు శిక్షతో పాటు 2,500 రూపాయల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను ఘనంగా నిర్వహిస్తాం

- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి - మహిళల జిల్లా కబడ్డీ జట్టు శిక్షణ శిబిరం ప్రారంభం

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సీనియర్స్ కబడ్డీ పోటీలను ఘనంగా నిర్వహిస్తామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియం కబడ్డీ గ్రౌండ్‌లో ఆయన జిల్లా మహిళల కబడ్డీ జట్టు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వచ్చే నెల 11, 12, 13, 14 తేదీల్లో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్లు ప్రతిభచాటి విజేతలుగా నిలిచేందుకుగాను జట్లకు శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు అవసరమైన సహాయ సహకారాలను సుడా ఆధ్వర్యంలో అందిస్తామన్నారు. రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సీహెచ్ సంపత్‌రావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 66 మహిళలు, పురుషుల జట్లు పాల్గొంటాయన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లకు, అధికారులకు, అఫీషియల్స్‌కు ఉచిత భోజన, వసతి సౌకర్యాలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోటీలను ఘనంగా నిర్వహించేందుకు అందరు సహాయసహకారాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లేష్‌గౌడ్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ప్రధానకార్యదర్శి ఆడెపు శ్రీనివాస్, ప్రతినిధి కొమురోజు కృష్ణ, వీరన్న, జిల్లా జట్టు కోచ్‌లు పద్మ, సుధాకర్, సీహెచ్ మల్లేశ్, సీనియర్ క్రీడాకారుడు నరోత్తం పాల్గొన్నారు.


కరీంనగర్ జిల్లా మహిళా కబడ్డీ జట్టుతో సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి, అతిథులు

నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకించండి

- డీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రఘుశంకర్‌రెడ్డి - పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా మహాసభ


మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎం రఘుశంకర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకించాలని డీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ముస్కు రఘుశంకర్‌రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ఫిలింభవన్‌లో పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాలుగో మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా సంస్థాగత జెండాను పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు పి మహేశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహాసభలకు ముఖ్యఅతిథులుగా హాజరైన ఎం రఘుశంకర్‌రెడ్డి, పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు పి మహేశ్, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వి శ్రీకాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ, సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో విద్యారంగం పూర్తిగా సంక్షోభంలోకి నెట్టబడిందని, విద్యా ప్రమాణాలు ఘోరంగా పడిపోయాయని విమర్శించారు. విద్యలో నాణ్యత కూడా లోపించిందన్నారు.

విద్య ద్వారానే మెరుగైన సమాజం సాధ్యపడుతుందన్నారు. విద్యారంగాన్ని అభివృద్ధి పరచడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. బడ్జెట్‌లో విద్యకు అతి తక్కువ నిధులను కేటాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు పాఠ్యాంశాలను మారుస్తున్నారని పాఠ్యపుస్తకాల నుంచి చరిత్రను, సైన్స్‌లను తొలగిస్తున్నారని, పురాణ కథలను, వాస్తు జ్యోతిష్య శాస్త్రాలను పాఠ్యపుస్తకాల్లోకి ప్రవేశపెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు ఏకపక్షంగా నూతన జాతీయ విద్యావిధానాన్ని యూజీసీ నూతన నిబంధనలను తీసుకువచ్చిందని విద్యార్థులంతా వీటిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. శాస్త్రీయమైన విద్యావిధానాన్ని అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం పీడీఎస్‌యు 50 ఏళ్లుగా ఉద్యమిస్తోందని, ఎంతో మంది విద్యార్థులు అమరత్వం పొందారని అన్నారు. వారి ఆశయ సాధనకు పీడీఎస్‌యూ కృషి చేస్తుందని అన్నారు. డిసెంబరు 10,11,12 తేదీల్లో వరంగల్ జిల్లాలో 23వ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నామని, దీనికి విద్యార్థి లోకం కదలిరావాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కూతాటి రాణా ప్రతాప్, జిల్లా నాయకులు రమేశ్, అజయ్, రాకేశ్, అస్లాం, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘాలకు చేయూతనివ్వండి


- అఖిలభారత మత్స్యకారుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి స్టాన్లీ



సమావేశంలో మాట్లాడుతున్న స్టాన్లీ

సుభాష్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల సహకార సంఘాలకు చేయూతనివ్వాలని అఖిలభారత మత్స్యకారుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి, కేరళ రాష్ట్ర ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ స్టాన్లీ కోరారు. మంగళవారం కరీంనగర్‌లోని రెవెన్యూ గార్డెన్‌లో తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మికుల నాలుగో రాష్ట్ర సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరింకల నర్సింహస్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా స్టాన్లీ మాట్లాడుతూ సముద్రం లేకున్నా మత్స్య సంపద సమృద్ధిగా ఉన్నా మత్స్యకారుల అభివృద్ధి మాత్రం జరగడం లేదన్నారు. మత్స్యకారులను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. మత్స్యకారులకు ఇంత వరకు సొంత ఇల్లు, చదువు, ఉద్యోగం లేదని కేవలం చేపలు పట్టుకొని జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో కృష్ణ, గోదావరి నదులను కలుపుకొని 77 నదులు ఉన్నాయని, 24వేల నదులు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో 10 లక్షల మంది మత్స్య వృత్తిపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమైనా సహాయం చేశాయా అని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల సహకార సంఘాలకు చేయూతనివ్వాలని డిమాండ్ చేశారు. మత్స్యశాఖ రిటైర్డ్ డీడీ మహిపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో సకాలంలో చేప సీడ్ వేయకపోవడం వల్ల చేపల్లో అనుకున్నంతగా ఎదుగుదల లేదన్నారు. జూన్ లేదా జూలై నెలలో చేప పిల్లలను వేయాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల మాజీ చైర్మెన్ చేతి ధర్మయ్య మాట్లాడుతూ మత్స్యమిత్ర మహిళా గ్రూపులను కొనసాగించాలని, మిడ్‌మానేరులో విస్తారంగా చేపలు పెంచే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్, అంబటి వెంకన్న, జీవ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర్, మునిగల రమేశ్, వర్ద వెంకట్‌రెడ్డి, గీట్ల ముకుందరెడ్డి, బాలమణి, జిల్లా అధ్యక్షుడు పిట్టల వెంకటేష్, ప్రధానకార్యదర్శి గణేశ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి బోయిన శ్రీకాంత్, జునగరి లక్ష్మన్, మాటూరు సమ్మయ్య, అరుణ, శశికళ, జెడిగల రాజన్న, సత్తయ్య, పప్పు సదానందం, మాటూరి లక్ష్మణ్, యు శ్రీనివాస్, గడప నరసింహస్వామి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బద్దిపోచమ్మ సన్నిధిలో భక్తజనసందడి


అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు బారులుతీరిన భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ బద్దిపోచమ్మ దేవాలయంలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. వేలాదిమంది భక్తులు అమ్మవారికి బోనం వండి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. తెల్లవారు జామునే పురవీధుల్లో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించడానికి భక్తులకు రెండుగంటల సమయం పట్టింది. క్యూలైన్‌లో భక్తులలు కిక్కిరిసిపోయారు. ఒక్కసారిగా బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయానికి వేలాదిమంది భక్తులు చేరుకోవడంతో ఇబ్బందులకు గురయ్యారు.

● సంక్షిప్తంగా..

కరీంనగర్ కల్చరల్: నగరంలోని యజ్ఞవరాహక్షేత్రంలో బుధవారం సుదర్శన హోమం నిర్వహించనున్నట్లు ఎస్వి ఎస్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ శివారు దుర్శేడ్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం స్నేహిత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైల్డ్ లైన్ ప్రియాంక , ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నిర్మల అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని మహాత్మానగర్ గ్రామం ఎల్ఎండీ కాలనీలోని మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల వృత్తి విద్య శిక్షణ కేంద్రానికి 26లక్షల రూపాయలతో హైదారాబాద్‌లోని స్త్రీనిధి క్రెడిట్ ఫెడరేషన్ లిమిటెడ్ వారు ఉచితంగా బస్సు అందించారు. ఈ సందర్భంగా స్త్రీనిధి క్రెడిట్ కోపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.విద్య సాగర్‌రెడ్డిని ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి హైదారాబాద్‌లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

కరీంనగర్ కల్చరల్ : వికాసతరంగిణి, సంస్కార వికాస్ విభాగం, జీవ ఆశ్రమం శ్రీరామనగర్ ముచ్చింతల్‌లో చిన్న జీయరు స్వామి పర్యవేక్షణలో వివిధ శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు వికాస తరంగిణి కేంద్ర కమిటీ అధ్యక్షుడు ఎం జగదీశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కరీంనగర్ స్పోర్ట్స్ : జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ వింధ్యావాలీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా కేంద్రంలోని పద్మనగర్ కరీంనగర్ డెయిరీని మంగళవారం సదర్శించారు.

సైదాపూర్: మండలంలోని అమ్మనగుర్తి నుంచి కాట్రపల్లి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన మంత్రి మరమ్మతులకు ఆదేశించారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లకదాసరి మల్లయ్య తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు మంగళవారం పనలు చేశామన్నారు.

భగత్‌నగర్:నగరంలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ (సిబిఎస్ఈ)లో వార్షిక క్రీడా సంబరాలు ఘనంగా ముగిసాయి. సెయింట్ జార్జ్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పి పాతిమారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు శారీరక దృడత్వం ఎంతో ముఖ్య మన్నారు. అథ్లెటిక్స్, క్రికెట్ ఖోఖో బాస్కెట్‌బాల్, వాలీబాల్, త్రోబాల్, స్కిప్పింగ్‌లు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భార్గవ్, ప్రియదర్శిని పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి వడ్డీలేని రుణాలు



రుణాలను పంపిణీ చేస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



మానకొండూర్‌లో వడ్డీలేని రుణాల చెక్కును పంపిణీ చేస్తున్న అధికారులు

కరీంనగర్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం వడ్డీలేని రుణాలను అందిస్తోందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని మహిళా సంఘ సభ్యులకు వడ్డీలేని రుణాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సుడా చైర్మన్ కొమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే హాజరయ్యారు. నియోజకవర్గంలోని 1,230 స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఒక కోటి ఇరవై ఆరు లక్షల రూపాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్ డీపీఎం తిరుపతి, ఎంపీడీవో సంజీవరావు, ఏపీఎం, సీసీలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ : గ్రామీణ ప్రాంతాల్లోని మహిళ స్వయం సహాయక సంఘాలకు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలేని రుణాలు మంజూరు చేసిందని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 3,952మంది లబ్ధిదారులకు రూ.3.83కోట్ల వడ్డీ లేని రుణాలు విడుదల చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళ అభివృద్ధి ప్రాధాన్యతగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం తోడుగా ఉంటుందని తెలిపారు.

మానకొండూర్: వడ్డీలేని రుణాలతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని డిప్యూటీ సీఈవో పవన్‌కుమార్ సూచించారు. మానకొండూర్‌లోని రైతు వేదికలో మంగళవారం నియోజకవర్గంలోని మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఓదెలు, వైస్ చైర్మన్ తిరుమల్‌రెడ్డి, డీపీఎం సంధ్యారాణి, ఎంపిడివో వరలక్ష్మీ, వివిధ మండలాల ఏపీఎంలు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లికి ఘన సన్మానం



మేడిపల్లి సత్యంకు దట్టికడుతున్న సిరాజ్‌హుస్సేన్



మేడిపల్లి సత్యంను సన్మానిస్తున్న కోట జూనియర్ కళాశాలల చైర్మన్ డాక్టర్ డి. అంజిరెడ్డి

కరీంనగర్ అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నూతన డీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ హుస్సేన్ కరీంనగర్‌లో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. డీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా మేడిపల్లి సత్యం చేతికి దట్టి కట్టారు. శాలువా కప్పి సన్మానించారు. సందర్భంగా సిరాజ్ హుస్సేన్ మాట్లాడుతూ డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సారధ్యంలో కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర్ కాంగ్రెస్ నూతన అధ్యక్షులు వైద్యుల అంజన్‌కుమార్, ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్(నగర) కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమితులైన వైద్యుల అంజన్ కుమార్‌ను రాష్ట్ర మున్నూరు కాపు యువజన నాయకులు ఘనంగా సన్మానించారు.

● కరీంనగర్ అర్బన్ : ఇటీవల కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను మంగళవారం కోట రెసొనెన్స్ జూనియర్ కళాశాలల చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడిపల్లి సత్యం రాజకీయాల్లో ప్రజాకర్షక నాయకుడిగా, అభివృద్ధి పట్ల కట్టుబాటుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలో పార్టీ శక్తిని పెంచుతారనే నమ్మకం ఉందన్నారు. కార్యక్రమంలో అజయ్‌రెడ్డి స్థానిక నాయకులు, విద్యావేత్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బీసీ సంఘం ఆధ్వర్యంలో నిరసన

మానకొండూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్‌లోని పల్లెమీద బస్టాండ్ వద్ద మంగళవారం మండల బీసీ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ధర్నా విరమింపజేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగు సంపత్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ బీసీలకు 42 శాతం అమలయ్యాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని లేని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల సురేందర్, ముంజ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షులు వీర్ల దిలీప్‌కుమార్ ఉన్నారు.

సుడా చైర్మన్‌ను కలిసిన నాయకులు

కరీంనగర్ అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో విజయం సాధించి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కర్ర రాజశేఖర్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడుగా నియామకం అయిన వైద్యుల అంజన్ కుమార్‌లు మంగళవారం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారిని సుడా చైర్మన్ శాలువాతో సన్మానించారు.

'పంచాయతీ' పోరుకు నగారా

(5వ పేజీ తరువాయి)

తీలకు, 174 వార్డులకు, తిమ్మాపూర్ మండలంలోని 23 పంచాయతీలు, 212 వార్డులకు, గన్నేరువరం మండలంలోని 17 పంచాయతీలు, 140 వార్డులకు, మానకొండూర్ మండలంలోని 29 పంచాయతీలు, 280 వార్డులకు, శంకరపట్నం మండలంలోని 27 పంచాయతీలు, 240 వార్డులకు ఎన్నికలు జరుగుతాయి. ఈ పంచాయతీల్లో 1,046 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ విడతలో 113 పంచాయతీలకు, 1046 వార్డులకు ఎన్నికలుజరుగుతాయి. ఈ పంచాయతీల్లో డిసెంబరు 14న పోలింగ్ జరగనుంది.

● మూడో విడతలో వీణవంక మండలంలోని 26 పంచాయతీలు, 246 వార్డులకు, ఇల్లందకుంట మండలంలోని 18 పంచాయతీలు, 166 వార్డులకు, జమ్మికుంట మండలంలోని 20 పంచాయతీలు, 188 వార్డులకు, హుజురాబాద్ మండలంలోని 20 పంచాయతీలు, 196 వార్డులకు, సైదాపూర్ మండలంలోని 27 పంచాయతీలకు, 238 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ విడతలో 111 పంచాయతీలకు, 1034 వార్డులకు ఎన్నికలు జరుగుతాయి. 1034 పోలింగ్ కేంద్రాల్లో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకుంటారు. ఈ పంచాయతీల్లో డిసెంబరు 17న పోలింగ్ జరగనుంది.

● షెడ్యూల్ ఇలా....

మొదటి విడత ఎన్నికలు జరిగే పంచాయతీల్లో ఈనెల 27 నుంచి నామినేషన్లను స్వీకరిస్తారు. ఆయా పంచాయతీల్లో 27న ఉదయమే ఎన్నికల నోటిఫికేషన్‌జారీ చేస్తారు. గ్రామపంచాయతీల్లో వార్డు వారీగా ఓటర్ల జాబితాను రిటర్నింగ్ అధికారి ప్రదర్శిస్తారు. 27 నుంచి 29 వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. నవంబరు 30న నామినేషన్లను పరిశీలించి చెల్లుబాటైన అభ్యర్థుల జాబితాను వెల్లడిస్తారు. ఏవైనా అభ్యంతరాలుంటే డిసెంబరు 1 సాయంత్రం 5 గంటల వరకు రిటర్నింగ్ అధికారికి అప్పీలు చేసుకోవలసి ఉంటుంది. డిసెంబరు 3న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశముంటుంది. ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. డిసెంబరు 11న మొదటి విడత పోలింగ్ జరుగుతుంది. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటింగ్ నిర్వహించి, 2 గంటల నుంచి ఓట్లను లెక్కిస్తారు. అదే రోజు ఫలితాలను వెల్లడించి, ఉప సర్పంచు ఎన్నిక నిర్వహిస్తారు.

● రెండో విడత:

ఈనెల 30 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది. అదే రోజు ఉదయం ఎన్నికల నోటీసును జారీచేసి వార్డుల వారీగా ఓటర్ల జాబితాను పంచాయతీలో ప్రదర్శిస్తారు. నవంబరు 30 నుంచి డిసెంబరు 2 సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 3న నామినేషన్లను పరిశీలించి చెల్లుబాటు అయిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. 4న సాయంత్రం 5 గంటల వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. 5న సాయంత్రం 5 గంటలలోపు అభ్యంతరాలను పరిష్కరిస్తారు. 6న సాయంత్రం 3 గంటల వరకు ఉపసంహరణ చేసుకునే అవకాశముంటుంది. ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత 6న పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. డిసెంబరు 14న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటింగ్ నిర్వహిస్తారు. 2 గంటల నుంచి లెక్కిస్తారు.

● మూడో విడత :

డిసెంబరు 3 నుంచి నామినేషన్లను స్వీకరిస్తారు. 5వ తేదీ వరకు నామినేషన్లను దాఖలు చేసుకోవచ్చు. 6న నామినేషన్లను పరిశీలించి, చెల్లుబాటైన నామినేషన్ల వివరాలను వెల్లడిస్తారు. 7న సాయంత్రం 5 గంటల వరకు అభ్యంతరాలను స్వీకరించి 8వ సాయంత్రం 5 లోపు వాటిని పరిష్కరిస్తారు. డిసెంబరు 9న మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. మూడో విడత పోలింగ్ డిసెంబర్ 17న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తారు. 2 గంటల నుంచి ఓట్లను లెక్కిస్తారు. అదే రోజు ఫలితాలను వెల్లడించి, ఉప సర్పంచు ఎన్నిక నిర్వహిస్తారు.

స్నేహిత కార్యక్రమంపై అవగాహన కలిగి ఉండాలి



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరమణ

హుజూరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు స్నేహిత కార్యక్రమంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాల మేరకు స్నేహిత-2 కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో సుగుణ, మెడికలాఫీసర్ డాక్టర్ తులసీదాస్, డాక్టర్ జరీనా, ఎంఈవో శ్రీనివాస్, హెచ్ఎం సమ్మిరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: స్నేహిత కార్యక్రమం విద్యార్థులకు ఆత్మస్థయిర్యాన్ని నింపుతుందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్నేహిత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎమ్‌హెచ్‌వో డాక్టర్ చందు, వైద్యాధికారిణి డాక్టర్ వరుణ, మండల విద్యాధికారి హేమలత, సిడిపివో సుగుణ, స్పెషల్ ఆఫీసర్ సుప్రియ, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ తనిఖీ చేశారు. డిప్యూటి డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, డాక్టర్ తులసీదాస్, సిబ్బంది ఉన్నారు.

తిమ్మాపూర్ : కేంద్రంలోని మోడల్ పాఠశాల, మైనారిటీ పాఠశాలల్లో మంగళవారం స్నేహిత ఫేస్-2 అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇంచార్జి సిడిపివో శ్రీలత, కోఆర్డినేటర్ సంపత్, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శంకరపట్నం: స్నేహిత కార్యక్రమంలో భాగంగా శంకరపట్నం మండలం కేజీబీవీలో విద్యార్థులకు భద్రత, స్వీయ రక్షణపై హుజూరాబాద్ ఏసీపీ మాధవి మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ గురించి తెలియజేశారు.సోషల్ మీడియా వేదిక ద్వారా అపరిచత వ్యక్తులతో వివరాలు పంచుకోవద్దన్నారు. ఎంఈవో లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైదాపూర్ మండలంలో రెండు గ్రామాల్లో ఎన్నికలు నిలిపివేత

సైదాపూర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని రాంచంద్రాపూర్, నూతనంగా ఏర్పడిన కురుమల్లి గ్రామాలలో సర్పంచ్ ఎన్నికలు నిలిపివేస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకున్నట్లు ఎంపీడీవో యాదగిరి తెలిపారు. కురుమపల్లి గ్రామాన్ని నిబంధనలకు విరుద్ధంగా ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారని రాంచంద్రాపూర్ గ్రామస్థులు హైకోర్టును ఆశ్రయించారు. కురుమపల్లి గ్రామ పంచాయతీని రద్దు చేయాలని కోరారు. దాంతో కోర్టు స్టే విధించింది. దీంతో ఎన్నికల సంఘం ఆ గ్రామాలలో ఎన్నికలు నిలిపివేసింది. కురుమపల్లి బీసీ జనరల్ కాగా, రాంచంద్రాపూర్ జనరల్‌కు రిజర్వేషన్ కేటాయించారు. దీంతో ఆశావహులు నిరాశ చెందుతున్నారు.

ఇందిరమ్మ చీరల పంపిణీ

హుజూరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో మంగళవారం మహిళా ఇందిరాశక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు చీరలు, వడ్డీలేని రుణాలను పంపిణీ చేశారు. ఆర్డీవో రమేష్‌బాబు, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో సునీత పాల్గొన్నారు.

ఇల్లందకుంట : మండల కేంద్రంలో మహిళలకు ఇందిరమ్మ చీరలను కాంగ్రెస్ నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండ లాధ్యక్షుడు పెద్ది కుమార్, ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: మండల కేంద్రంలో ఇందిరా మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. నాయకులు ఎండీ సాహెబ్ హుస్సేన్, సునీల్, రాజ్ కుమార్, రాజయ్య, రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు శ్రీచైతన్య విద్యార్థులు

తిమ్మాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు సాత్విక్, శివకృష్ణ ఎస్‌జిఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన యోగా పోటీలలో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు.

మాజీ మంత్రి హరీష్‌రావుకు ఘన స్వాగతం



హరీష్‌రావుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే గంగుల, నాయకులు

తిమ్మాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీ వద్ద, కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ వద్ద మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావుకు బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. జమ్మికుంట మండలం తనుగుల గ్రామ శివారులో కుంగిన చెక్‌డ్యాంను పరిశీలించేందుకు వెళుతున్న హరీష్‌రావును ఎల్ఎండీ కాలనీ వద్ద మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అలుగునూర్ వద్ద కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి హరీష్ రావుకు ఘనంగా స్వాగతం పలికారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జీవి.రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, కొప్పుల ఈశ్వర్, సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు ఇతర నాయకులు పాల్గొన్నారు.

అంజన్న ఆలయంలో పూజలు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలోని పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయాన్ని మంగళవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిలు దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి రూ.2 లక్షల చెక్కును మాజీ మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా దేవాలయ కమిటీ పాలకవర్గ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

టవర్‌సర్కిల్, హెచ్‌బీ కాలనీల్లో ఆక్రమణల తొలగింపు

కరీంనగర్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టవర్‌సర్కిల్, హౌజింగ్‌బోర్డుకాలనీల్లో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్, డీఆర్ఎస్ బృందాలు ఆక్రమణలను తొలగించారు. కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశాల మేరకు మంగళవారం నిత్యం రద్దీగా ఉండే టవర్ సర్కిల్, మార్కెట్ ఏరియాతోపాటు హౌజింగ్ బోర్డుకాలనీల్లోని రోడ్లు, ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు.

సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడికి ఘన సన్మానం

కరీంనగర్ అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కరీంనగర్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎంపికైన వైద్యుల అంజన్ కుమార్‌ను మంగళవారం కరీంనగర్ ఆదర్శనగర్ శివాలయం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శివాలయం అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మెతుకు కనకయ్య, కమిటీ సభ్యులు కలిసి అంజన్ కుమార్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేయాలి

కరీంనగర్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు ఇప్పించాలని జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం జిల్లా యూనియన్ అడ్‌హక్ కమిటీ చైర్మన్ భాషవేణి మల్లేశం యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు మంగళవారం ఆయన జిల్లా పశు సంవర్ధకశాఖ, జిల్లా పశువైద్య అధికారి లింగారెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ట్రినిటీ విద్యార్థి



నితిన్‌ను అభినందిస్తున్న ట్రినిటీ చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి అండర్-19 ఎస్‌జీఎఫ్ నెట్‌బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని ట్రినిటీ జూనియర్ కళాశాల విద్యార్థి పి నితిన్ ఎంపికయ్యాడు. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో డిసెంబర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో నితిన్ తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నారాయణ తెలిపారు. నితిన్‌ను ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపకులు దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి అభినందించారు.

వరికొయ్యలను కాల్చవద్దు

జమ్మికుంట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వరి పంటలో కోయకాలను రైతులు ఎట్టి పరిస్థితుల్లో కాల్చొద్దని హుజూరాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకులు జి సునీత అన్నారు. మంగళవారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం, మండలంలోని మాచనపల్లి గ్రామాల్లో ఆమె క్షేత్ర సందర్శన చేశారు. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 2బస్తాలు చల్లి వరి కోయకాలను భూమిలో కలియ దున్నితే పంట వ్యర్థాలు త్వరగా కుళ్లిపోతాయని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్, ఏఈవో రాజేష్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

వీణవంక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని వల్బాపూర్ గ్రామానికి చెందిన ఓ రైతు ఖాతాలో నుంచి రూ.1.80లక్షలు పోయాయన్నారు. రైతుకు ఫోన్‌లో వచ్చిన ఏపీకే యాప్ అప్లికేషన్ డౌన్‌లోడ్ చేయడం వల్ల తన మొబైల్ తనకు తెలియకుండానే హ్యాక్ అయ్యిందన్నారు. రైతు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్.నవంబరు25 (ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు, ఏడిఈ, లావణ్య తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయు ప్రాంతాలు- మంకమ్మతోట, పారమిత పాఠశాల ప్రాంతం, సిద్ధార్థ పాఠశాల ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

జాతీయ వ్యాయామ విద్యా ఉపాధ్యాయ దినోత్సవం

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారతీయ వ్యాయామ విద్యా పితామహుడు హ్యారీ క్రో బక్ జయంతి పురస్కరించుకొని మంగళవారం జిల్లా ప్రైవేట్ వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వ్యాయామ ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రైవేట్ విద్యా ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బత్తిని శ్రీధర్‌గౌడ్, దారం గౌతమ్ రెడ్డి, కోశాధికారి కంకటి అనూప్ కుమార్‌లు కేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు.

బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే

భగత్‌నగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి రామడుగు వయా మోతె గ్రామానికి బస్సును చొప్పదండి శాసనసభ్యుడు మేడిపల్లి సత్యం మంగళవారం ప్రారంభించారు. రామడుగు మండల కేంద్రంలో జగిత్యాల డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ కె కల్పన, ఎస్‌టిఐ శ్రీనివాస్, ఎస్‌డిఐ ఎస్‌జె రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 78వ ఎన్‌సీసీ గ్రూపు స్థాయి ఆవిర్భావ దినోత్సవాన్ని 9వ తెలంగాణ బెటాలియన్ కరీంనగర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న కంబైండ్ వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా నిర్వహించిన 78వ ఎన్‌సీసీ ఆవిర్భావ వేడుకలకు ముఖ్య అతిథిగా నిజామాబాద్ గ్రూపు కమాండ్ కల్నల్ రాజేష్ కపూర్ హాజరయ్యారు.

కేంద్ర సహాయ మంత్రి పరామర్శ

తిమ్మాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి అత్తమ్మ గవ్వ మణెమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ మంగళవారం మండలంలోని మహాత్మానగర్ గ్రామంలోని ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి ఇంటికి వెళ్లి మణెమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి, సొల్లు అజయ్ వర్మ, కూనమళ్ల ప్రేమ్‌చంద్, శివారెడ్డి తదితరులు ఉన్నారు.

దాతల సాయంతో అదనపు తరగతి నిర్మాణం



అదనపు గదిని ప్రారంభిస్తున్న నాయకులు

సైదాపూర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కీ.శే కొత్త సుశీలదేవి-పద్మనాభరెడ్డిల జ్ఞాపకార్థం వారి కుమారులు కొత్త వెంకట నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ కొత్త రాజిరెడ్డి, కొత్త నాగిరెడ్డి, వెన్కెపల్లి సింగిల్‌విండో చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డిలు నిర్మించిన అదనపు గదిని సైదాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్, సింగిల్‌విండో అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ కొత్త రాజిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాగేశ్వరిలో ఘనంగా ఫ్రెషర్స్ డే

తిమ్మాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో సిఎస్ఈ(ఏఐ అండ్ ఎంఎల్) విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఫ్రెషర్స్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కళాశాల జనరల్ సెక్రటరీ జి.శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులు తమ ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో కళాశాల సంయుక్త కార్యదర్శి డి.శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ చెరువు అభివృద్ధి పనులు ప్రారంభం

హుజూరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని మోడల్ చెరువు అభివృద్ధికి మంగళవారం పనులు మొదలు పెట్టినట్లు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.3లక్షలు మంజూరయ్యాయన్నారు.